క్లుప్తంగా

రహదారి నిర్మించండి



రోడ్డు నిర్మాణం చేయాలని కోరుతున్న గ్రామస్తులు

పార్వతీపురం రూరల్: మండలంలోని డోకిశీల పంచాయతీ తేలునాయుడువలస గ్రామం నుంచి గంజిగెడ్డ గిరిజన గ్రామానికి గతంలో రోడ్డు పనులు ప్రారంభించి మధ్యలో నిలిచిపోయాయి. ఈ కారణంగా రహదారి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారని తక్షణమే ప్రభుత్వం స్పందించి రోడ్డునిర్మాణం చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో గంజిగెడ్డ గిరిజన గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. రోడ్డు లేని కారణంగా అనేక సౌకర్యాలకు గంజిగెడ్డ గ్రామం నోచుకోవడం లేదని సీపీఎం నాయకుడు రాము అన్నారు. గతంలో రోడ్డు నిర్మాణం చేయాలని అనేకమార్లు అధికారులకు వినతులు అందజేశామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు.

సరిహద్దులో వెలిసిన కోటదుర్గమ్మ



బత్తిలి శివారులో వెలసిన శ్రీ కోటదుర్గమ్మ

భామిని: ఆంధ్రా – ఒడిశా సరిహద్దు వంశధార నదీ తీరంలో వెలసిన శ్రీ కోటదుర్గమ్మ సన్నిధి దర్శనమంటే భక్తులకు వరంలాంటిది. బత్తిలి శివారులో పాత పోలీసు క్వార్టర్స్ ప్రాంతంలో ఉన్న అమ్మ సన్నిధిలో దసరా ఉత్సవాల్లో భాగంగా దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నవరాత్రులు పూజలు నిర్వహించడం ఆనవాయితీ. దుర్గామాత విగ్రహ ఏర్పాటుకు ప్రత్యేక అలంకరణతో మందిర ఏర్పాటు కూడా చేయనున్నారు. బత్తిలిలో వెలిసిన శ్రీత్రిపుర సుందరీ దేవి ఆలయంలోనూ దేవి నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించనున్నారు.

రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షురాలిగా సావిత్రి



నూతనంగా ఎన్నికైన రెవెన్యూ అసోషియేషన్ సభ్యులు

పాలకొండ: పాలకొండ డివిజన్ రెవెన్యూ అసోషియేషన్ అధ్యక్షురాలుగా సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో ఎం.సావిత్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ అసోషియేషన్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని రెవెన్యూ ఉద్యోగులు అసోషియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పాలకొండ తహసీల్దార్ కార్యాలయం సీఎస్‌డీటీ పి.సన్యాసిరావు, అసోసియేట్ అధ్యక్షులుగా హెచ్‌డీటీ ఎంఎస్ ప్రసాద్‌రావును ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా టి.సురేష్‌కుమార్, ఎన్.శేఖరం, కె.శ్రీవిద్యలను ఎన్నుకున్నారు. జాయింట్ సెక్రటరీలుగా ఆర్.మనోహర్, పి.మణిప్రభ, మీనాక్షి, కోశాధికారిగా వి.గణేష్, కార్యవర్గ సభ్యులుగా ఎన్.ఆశాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ ఏవో జి.శ్రీరామ్‌మూర్తి, డీటీ ప్రసాద్‌రావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. బలిజిపేట తహసీల్దార్ బాలమురళీకృష్ణ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఎన్‌జీవో సంఘం డివిజన్ గౌరవ అధ్యక్షులు ఎ.లిల్లీపుష్పనాథం ఈ ఎన్నికలను పర్యవేక్షించారు.

నేటి నుంచి శరన్నవరాత్రులు



వీరఘట్టం: వీరఘట్టం ఇలవేల్పు శ్రీకోటదుర్గ తల్లి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2 వరకు దసరా మహోత్సవాలు జరగనున్నాయి. తొలిరోజు సోమవారం ఉదయం 4 గంటలకు తొలి పూజ చేయనున్నారు. అనంతరం ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు నిర్విరామంగా మహిళలచే దుర్గాదేవికి కుంకుమ పూజలు ఉంటాయన్నారు. దుర్గాదేవిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేశారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

రాజాం: మొక్కలు నాటడం సామాజిక బాధ్యత అని, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని రాజాం ఎక్సైజ్ శాఖ సీఐ ఆర్.జైభీమ్ సూచించారు. మండలంలోని పొగిరి జిల్లా పరిషత్ ఆవరణలో ఎక్సైజ్ పోలీస్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.

గిరిజన యువతను అరెస్ట్ చేయిస్తారా?



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

- మంత్రి తీరు బాధాకరం

సాలూరు: గిరిజన నిరుద్యోగులు తమ సమస్యలను గిరిజనసంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి తెలుపుకునేందుకు వస్తే వారిని పోలీసులతో అరెస్ట్ చేయించడం అత్యంత దారుణమని, దీనిని తాము ఖండిస్తున్నామని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా వైస్‌ఛైర్మన్ కొండగొర్రి ఉదయ్‌కుమార్, నాయకులు నిమ్మక అన్నారావు, సుర్ల ప్రవీణ్‌చందు, మచ్చ భీమారావు తదితరులు అన్నారు. ఈ మేరకు ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయకపోడంతో గిరిజనులకు అన్యాయం జరుగుతోందని, తమ సమస్యలను మంత్రికి తెలిపేందుకు శనివారం సాలూరులో ఆమె క్యాంప్ ఆఫీసు వద్దకు సుదూర పాడేరు ఐటీడీఏ పరిధిలో గల ప్రాంతాల నుంచి నిరుద్యోగ గిరిజన యువత వచ్చారన్నారు. మంత్రి సంధ్యారాణి ఇంటి చుట్టూ పోలీసు పహారా ఏర్పాటుచేసి, గిరిజన యువతను నిర్బంధించి, అక్రమంగా అరెస్టులు చేయడం దారుణమన్నారు. గత ఎన్నికలముందు సంధ్యారాణి ప్రతి గిరిజన గ్రామానికి వచ్చి తాను మీ గిరిజనురాలినని చెప్పి, ఓట్లు వేసి గెలిపిస్తే మీ సమస్యలు పరిష్కరిస్తానని హామీలు ఇచ్చారని పేర్కొన్నారు. నేడు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇవ్వడానికి వస్తే అడ్డుకుని అరెస్టులు చేయించారని వాపోయారు.

ఇచ్చిన హామీలు ఘనం

గతంలో సాలూరు మండలంలో సుమారు ఏడాదికి పైగా ఏజెన్సీ ధృవపత్రాల కోసం ఆందోళన చేస్తే నాడు ఆమె ఆ శిబిరం వద్దకు వెళ్లి నేను గెలిచిన వెంటనే మీ సమస్యలు పరిష్కరిస్తానని, గిరిజన నిరుద్యోగుల కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహించేలా చేస్తానని మాట ఇచ్చారని నేడు అందుకు విరుద్ధంగా జరిగిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల గిరిజన నిరుద్యోగ ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. శనివారం మంత్రి క్యాంప్ ఆఫీసులో అందుబాటులో ఉంటారేమోనని, వినతిపత్రం ఇవ్వడానికి శాంతియుతంగా వచ్చిన గిరిజన నిరుద్యోగులు,మంత్రి లేని క్రమంలో వారితో ఫోన్‌లో అయినా మాట్లాడి వినతిపత్రాన్ని క్యాంపు ఆఫీసులో ఎవరికైనా ఇచ్చి వెళ్లండని చెబితే సరిపోయేదని, లేదా క్యాంపు ఆఫీసులో ఎవరైనా ఆ వినతిపత్రాన్ని తీసుకుని పంపించేస్తే సరిపోయేదని కానీ అక్రమంగా నిర్బంధించి అరెస్టులు చేయించడం సమంజసం కాదన్నారు.

గతంలో ఇలా అరెస్టులు లేవు

గతం ప్రభుత్వంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఇంటికి గిరిజనులు తమ సమస్యలను చెప్పుకునేందుకు పలుమార్లు ఇదేవిధంగా వెళ్లారని, అప్పుడు ఇటువంటి అరెస్టులు రాజన్నదొర చేయించలేదని ఆదివాసీ సంఘం నాయకులు గుర్తుచేశారు.

'చలో విశాఖ' జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

సీతానగరం: విశాఖ డైరీ పాడిరైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల24న చేపట్టే చలో విశాఖ డైరీ కార్యక్రమంలో పాడిరైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, బి.దాసు అన్నారు. ఈ మేరకు మండలంలోని చినభోగిలిలో ఏపీ పాల ఉత్పత్తిదారుల సంఘాల నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం చలో విశాఖ డైరీ వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 24న అక్కిరెడ్డిపాలెం గాజువాకలో ఉన్న విశాఖ డైరీ అవినీతిపై హౌస్‌కమిటీతో దర్యాప్తుచేసి దోషులను శిక్షించాలని, వారి ఆస్తులను రక్షించాలని, పాలు లీటరుకు రూ.10 లు పెంచాలని, ప్రతి మూడు నెలలకు ఒక పర్యాయం, సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన పాడి పశువులకు సంబంధించిన నష్టపరిహారాన్ని రైతులకు ఇవ్వాలని, ఉచిత బీమా, మందులు సమకూర్చాలని కోరారు. నిర్దేశించిన డిమాండ్లన్నీ పరిష్కరించడానికి చలో విశాఖ డైరీ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు సీహెచ్ కృష్ణ, బి.అప్పారావు, సింహాచలం, పాడి రైతులు సత్యం, రమణమ్మ పాల్గొన్నారు.

500 కిలోల ఘన జీవామృతం తయారీ



పణుకువలసలో ఘన జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది, మహిళలు

బలిజిపేట: ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బలిజిపేట మండలంలోని పణుకువలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి లక్ష్మి సమక్షంలో ఆదవారం ఘన జీవామృతం తయారు చేశారు. దీని తయారీకి 500కిలోల తాజా ఆవుపేడ, 10 కిలోల బెల్లం, 10కిలోల పప్పుల పిండి, 50లీటర్ల గోమూత్రం, రెండు కిలోల పుట్టమన్ను వినియోగించనున్నట్లు ఆమె తెలిపారు. బెల్లం, పప్పుల పిండి, పుట్టమన్ను గోమూత్రంలో పూర్తిగా కరిగే వరకు విడివిడిగా కలిపి మూడు మిశ్రమాలను 500కిలోల ఆవుపేడలో బాగా కలిసేంతవరకు ఉండలు లేకుండా మెత్తగా అయ్యేంతవరకు కలిపి ఆ పేడను ఉండలుగా చుట్టుకుని నీడలో ఒక పట్టా లేదా టార్పాలిన్ మీద వారం రోజులు ఎండబెట్టుకోవాలని తెలిపారు. తరువాత ఘనజీవామృతం తయారవుతుందన్నారు. దీనిని పంటపొలాల్లో ఉపయోగించడం వల్ల భూమిలో సేంద్రియ కర్బన్ శాతం పెరిగి, అన్ని రకాల సూక్ష్మజీవులు వృద్ధి చెంది పంటకు కావలసిన అన్ని రకాల సూక్ష్మ పోషకాలు లభించి, ఆరోగ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నాటి సర్వే రాళ్లే నేడు రహదారులకు ఆధారం



చప్పబుచ్చింపేట, వల్లాపురం మధ్యలో గోతుల్లో వేసిన సర్వేరాళ్లపై సాగిస్తున్న రాకపోకలు

సాలూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సర్వేరాళ్ల నేడు రహదారులకు ఆధారమవుతున్నాయి. గత ప్రభుత్వంలో రైతుల పొలాల సరిహద్దులు తెలిపేందుకు సర్వేరాళ్లను ఏర్పాటుచేసేందుకు అధిక సంఖ్యలో తీసుకువచ్చారు. కాగా ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ రాళ్లు నిరుపయోగంగా మారాయి. మరోవైపు ఈ ప్రభుత్వంలో రోడ్లు అధ్వానంగా గోతులతో నిండిన పట్టించుకుంటున్న పాపాన పోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. గోతులతో నిండిన రోడ్ల కారణంగా బాగువలస మీదుగా సాలూరు–మక్కువకు గడిచిన నెలరోజులుగా బస్సు సర్వీసును నిలుపుదల చేశారు. అయితే ద్విచక్రవాహనాలు, ఆటో వంటి వాహనాలు ఈ గోతుల మార్గాల గుండానే అతికష్టం మీద రాకపోకలు సాగిస్తున్నాయి. చప్పబుచ్చింపేట, వల్లాపురం మధ్య గోతుల్లో ఈ సర్వేరాళ్లు వేసి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో రోడ్ల మరమ్మతులు చేయడంలేదని, ఈ ప్రభుత్వంలో కూడా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇచ్చిన సర్వే రాళ్లే రాకపోకలకు ఆధారంగా మారాయని ఈ మార్గం గుండా వెళ్తున్న ప్రజలు చర్చించుకుంటున్నారు.

భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు..: డీఎస్పీ

పాలకొండ: కోటదుర్గమ్మ ఉత్సవాల్లో భక్తులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వహించాలని డీఎస్పీ ఎం.రాంబాబు సూచించారు. దసరా ఉత్సవాల నిర్వహణ కోసం సిబ్బందికి విధులు, బాధ్యతలు ఆదివారం అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన ఈ తొమ్మిది రోజుల పాటు పోలీసులు నిర్వహించాల్సిన విధులు వివరించారు. పార్కింగ్, క్యూలైన్లు, ప్రధాన ద్వారం, అవుట్ గేట్ ప్రధాన రహదారిలో పోలీసులకు విధులు అప్పగించారు. నిరంతరం పోలీసు కంట్రోల్ రూం పనిచేయాలని సూచించారు. స్థానిక సీఐ ప్రసాద్, ఎస్ఐ ప్రయోగమూర్తి ఈ బందోబస్తును పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. మొత్తం 200 మంది సిబ్బంది, ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు బందోబస్తు కోసం కేటాయించామని తెలిపారు.

ముగిసిన హిందీ వారోత్సవాలు

రాజాం: దేశసమైక్యతకు హిందీ భాష వారధని రాజాం హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు అన్నారు. ఆదివారం హిందీదివస్ వారోత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీభాష నేర్చుకుంటే ఎన్నో లాభాలు ఉన్నాయని వివరించారు.

అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములు నాయుడు

సీతానగరం: మండలంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్ల పనులు పూర్తిచేసి ప్రజలకు రాకపోకల సౌకర్యం కల్పించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, బి.శ్రీరాములు నాయుడు, వైఎస్సార్‌సీపీ యువత మండల అధ్యక్షుడు డి.కిషోర్‌కుమార్ అన్నారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ మండల కార్యాలయంలో ఆదివారం పార్టీ సీనియర్ నాయకులు ఆర్వీ పార్థసారథి, ఎస్ వెంకటరమణలతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ మండలంలో రాకపోకలకు రహదారుల ఇబ్బందులపై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అనంతరాయుడుపేట–ఏగోటివలస వయా గాదెలవలస బీటీరోడ్డు పనులు పనులు ప్రారంభించిన ఫస్ట్ లేయర్, 20 ఎంఎం రాయి వేసే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు అర్ధాంతరంగా నిలిచి పోయాయయన్నారు. అలాగే జోగింపేట–ఇప్పలవలస వయా పాపమ్మవలస బీటీరోడ్డు గోతుల మయం కావడంతో గోతుల్లో పడి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలియజేశారు. జగ్గునాయుడుపేట నుంచి నారశింహునిపేట వరకూ గల బీటీరోడ్డు శిథిలమైనా పట్టించు కోలేదని ఆరోపించారు. లచ్చయ్యపేట నుంచి గుమ్మిడివరం, గుమ్మిడివరం నుంచి అంటిపేట, అనంతరాయుడుపేట నుంచి రంగంపేటకు, కేఎస్ పురం నుంచి జానుమల్లువలస, బూర్జ నుంచి ఎస్ఎస్ పురం, ఇనంకలాం నుంచి బూర్జ సువర్ణముఖినది రేవుకు, బడేవలస నుంచి బూర్జ గ్రామంలోని నది వరకూ ఉన్న గ్రావెల్ రోడ్లు, మెటల్ రోడ్లకు అభివృద్ధి పనులు మంజూరు చేయాలని కోరారు. అలాగే పల్లెపండగలో ప్రారంభించిన బగ్గందొరవలస జంక్షన్ మీదుగా గెడ్డలుప్పి- కొత్తవలస వరకూ గల బీటీరోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు.

బడిదేవరమ్మకు ప్రత్యేక పూజలు



బడిదేవరమ్మకు మొక్కులు చెల్లిస్తున్న రైతులు, భక్తులు

పార్వతీపురం రూరల్: పూర్వం రాజుల కాలం నుంచి ఆనవాయితీగా వచ్చిన సంప్రదాయాన్ని నేటికీ ప్రజలు విశ్వాసంతో నమ్ముతూ ఆచరిస్తున్నారు. తమ పంటలు సక్రమంగా పండేందుకు అనుకూల వర్షాలు కురవాలంటూ ఎంతో కాలంగా ఆనవాయితీగా ఉన్న పార్వతీపురం మండలం వెలగవలస సమీపంలో బడిదేవరమ్మ కొండపై బడిదేవరమ్మ తల్లికి రైతులు, ప్రజలు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని ములగ గ్రామాలు, పెదబొండపల్లి, కోరె, గంగాపురం, సంగంవలస, వెంకంపేట, చినబొండపల్లి, కవిటిభద్ర పలు గ్రామాల ప్రజలు కొండకు వెళ్లి పూజలు నిర్వహిస్తుంటారు. అయితే ఆదివారం పెదబొండపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు కుటుంబ సభ్యులతో కలిసి బడిదేవరమ్మ కొండపై 20 అడుగుల విస్తీర్ణంలో ఉన్న బడిదేవరమ్మ చెక్కుడు రూపాన్ని శుద్ధిచేసి, పసుపు, కుంకుమలతో అలంకరించి మొక్కులు చెల్లించారు. అనంతరం కుండలో వండిన నైవేద్యాన్ని బడిదేవరమ్మకు సమర్పించి ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం మళ్లీ 20 కుండల నీటితో అభిషేకం చేసి పూజలను ముగించారు. ఈ పూజా కార్యక్రమాలపై పెదబొండపల్లికి చెందిన యాండ్రాపు చినరామినాయుడు వివరిస్తూ ఏటా వర్షాలు పంటలకు అనుకూలంగా కురవాలని ఈ విధంగా పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్వతీపురం మండలంలోని ఎన్నో గ్రామాల ప్రజలు నమ్మకమైన తల్లిగా బడిదేవరమ్మను కొలుస్తారన్నారు.

ఘనంగా 'గురజాడ'163వ జయంతి



బలిజిపేట: పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



సీతానగరం: గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

సీతానగరం: మహాకవి గురజాడ అప్పారావు 163వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం బగ్గందొరవలస కృషి విద్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వివిధ పాఠశాలలు వసతి గృహాల్లో, పుస్తక సేవాకేంద్రాల్లో మహాకవి గురజాడ అప్పారావు త్యాగనిరతిని, మహనీయుడు సాధించిన కీర్తి ప్రతిష్టలను స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి యువత సేవలందించాలని కృషి విద్యానికేతన్ కరస్పాండెంట్ డి.శ్రీనివాసరావు కోరారు.అలాగే పుస్తక సేవాకేంద్రాల్లో గురజాడ చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

బలిజిపేట: గురజాడ జయంతి వేడుకను మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ గురజాడ రచించిన కన్యాశుల్కానికి ఎంతో ఆదరణ లభించిందన్నారు. అటువంటి మహానుభావుడి నిస్మరించుకోవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పి.జగన్మోహనరావు, కె.కృష్ణ, గౌరీనాథ్, ఎన్.భూషణరావు, పి.పరశురామ్, జి.శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



నల్లగా మారిన పత్తికాయలను ఇంటికి తీసుకువచ్చి పోగుగా వేసుకున్న రైతులు



వర్షం నుండి రక్షణ కోసం టార్పాలిన్‌తో కప్పి ఉన్న మొక్కజొన్న

రైతు కంటకన్నీరు

- కురుస్తున్న వర్షాలతో పోతున్న పంటలు
- తల్లడిల్లుతున్న మొక్కజొన్న, పత్తి రైతులు

సాలూరు/పాచిపెంట:

గడిచిన కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు రైతులకు కంటకన్నీరు మిగులుస్తున్నాయి. ఇటు ప్రకృతి సహకరించక, మరోవైపు ప్రభుత్వం యూరియా వంటి ఎరువులు సక్రమంగా అందించడం, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులు అనేక కష్టాలు పడుతున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని పండిస్తున్న పంట కళ్ల ముందే పోతుంటే రైతులు తల్లడిల్లిపోతున్నారు. లాభం గురించి పక్కన పెడితే అప్పులుచేసి పెట్టిన పెట్టుబడి సొమ్మైనా వస్తుందా? రాదా? అనే ఆందోళనలో రైతన్నలు ఉన్నారు. సాలూరు నియోజకవర్గంలో అధికంగా మొక్కజొన్న, పత్తి వంటి వాణిజ్య పంటలు సాగవుతున్నాయి.

యూరియాలేక తగ్గిన దిగుబడి

పంట అదును సమయంలో యూరియా లేకపోవడంతో రైతులు అనేక పాట్లు పడ్డారు. గత ప్రభుత్వంలో రైతుభరోసా కేంద్రాల వద్ద సరిపడా ఎరువులు లభ్యమయ్యే పరిస్థితి నుంచి ఈ ప్రభుత్వంలో యూరియా బస్తా కోసం టోకెన్లు పట్టుకుని రోజంతా వేచిచూడాల్సిన పరిస్థితులను రైతులు ఎదుర్కొన్నారు. అదునులో ఎరువులు అందక పంట దిగుబడి కొంత తగ్గిందని రైతులు వాపోతున్నారు.

రోడ్లపైనే ఉన్న మొక్కజొన్న

మొక్కజొన్న పంట చేతికి వచ్చిన తరువాత రైతుకు అసలైన కష్టం మొదలైంది. దాదాపు 80 శాతం మొక్కజొన్న పంట విరిచి యంత్రాల సహాయంతో వాటిని రోడ్లపై, కళ్లాల్లో ఆరబెట్టుకుంటున్నారు. గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల మొక్కజొన్న గింజలను సంరక్షించుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అకస్మాత్తుగా పడిన వర్షంతో కనీసం టార్పాలిన్‌లు కూడా సరిగ్గా కప్పే సమయం లేకపోవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. గింజ తడిస్తే రంగు నల్లగా మారిపోతుంది. దిగుబడి తగ్గింది. కనీసం వచ్చిన పంటైనా చేతికొచ్చేలోపు వర్షాల కారణంగా అది కూడా దూరమైపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

కొనుగోలు కేంద్రాల ప్రారంభమెప్పుడు?

ఈ ప్రభుత్వంలో నేటి వరకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఊసే లేకుండాపోయింది. చేతికి వచ్చిన మొక్కజొన్నను నిల్వచేయలేని పరిస్థితి నెలకొంది. చేసేది లేక దళారులకే రైతులు పంటను విక్రయిస్తున్నారు. పంటంతా దళారులకు విక్రయాలు అయ్యాక ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే అది దళారులకు ఉపయోగమే తప్ప రైతులకు కాదని పలువురు రైతులు నిట్టూరుస్తున్నారు.



కురుస్తున్న వర్షాలకు తడిసి నేల రాలుతున్న పత్తి

కుళ్లుతున్న పత్తి

మెదటి విడతగా పత్తి పంట చేతికివచ్చే సమయంలో ఈ వర్షాలు వల్ల పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.ప్రధానంగా బొగడల నుంచి వచ్చిన పత్తి నేలపాలవుతోంది. పత్తికాయ కూడా కుళ్లిపోతోందని దీంతో తీవ్ర నష్టం కలుగుతుందని రైతులు వాపోతున్నారు. పత్తికాయలను ఇంటికి తీసుకువచ్చి పోగులుగా వేసుకుంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఆరు ఎకరాల్లో పత్తి, నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నాను. సుమారు రూ.రెండున్నర లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. పంట చేతికి వచ్చే సమయంలో భారీ వర్షాలు పడుతున్నాయి. మొక్కజొన్న పంట కళ్లాల్లో తడిసిపోతోంది. పత్తి పంట నేల రాలిపోతోంది. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

–ముల్లు భాస్కరరావు, రైతు, పాచిపెంట

కూటమి ప్రభుత్వం అన్నింటా విఫలం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రేగిడి: టీడీపీ కూటమి ప్రభుత్వం అన్నింటా విఫలమైందని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, నియోజకవర్గ మేధావుల వర్గం అధ్యక్షుడు కెల్ల మన్మథరావు అన్నారు. మండలంలోని కందిశ గ్రామంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు యూరియా పంపిణీ చేయడంలో, పంటలకు మద్దతు ధర కల్పించడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. రైతులు ఒక బస్తా యూరియా కోసం పడరాని పాట్లు పడుతుండడం కొద్దిరోజులుగా చూస్తున్నామని అన్నారు. ఎరువుల కోసం గతంలో రైతులు ఎప్పుడూ ఇలా రోజూ రోడ్డెక్కాల్సిన అవసరం రాలేదని, కూటమి ప్రభుత్వం చేతకాని తనవల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటకు సకాలంలో ఎరువు వేయలేకపోతే ఆ ప్రభావం దిగుబడిపై ఉంటుందన్నారు. తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు పంటలకు యూరియా వేస్తే క్యాన్సర్ వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెబుతుండడం హాస్యాస్పదమన్నారు. యూరియా సమస్యతో పాటు నియోజవర్గ రైతులను సాగునీటి సమస్య కూడా వేధిస్తోందని చెప్పారు. తోటపల్లి సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. తాము అధికారంలోకి వస్తే గుంతలు లేని రోడ్లను చూస్తారని ఎన్నికల సమయంలో కూటమి నేతలు చెప్పారని, గ్రామీణ ప్రాంత రోడ్లు గోతులతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయని, ఎక్కడా తట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదని ఆరోపించారు. రేగిడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నెల్లి పెంటన్నాయుడు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కింజరాపు సురేష్ పాల్గొన్నారు.

అక్టోబర్ 5న 'భోజన' కార్మికుల జిల్లా మహాసభలు

విజయనగరం గంటస్తంభం: జిల్లా మధ్యాహ్న భోజన పథకం నాల్గో మహాసభలు అక్టోబర్ 5న స్థానిక అమర్ భవన్‌లో జరగనున్నాయని విజయవంతం చేయాలని ఆ సంఘం (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు ఎం.మురళీధరరావు పిలుపునిచ్చారు.